## క్లుప్తంగా

### కొలతల ప్రకారం పనులు చేయాలి



వేతనదారులకు సూచనలు చేస్తున్న ఏపీఓ అరుణ

బొండపల్లి: ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తేనే ప్రభు త్వం నిర్దేశించిన గరిష్ట వేతనం అందుతుందని ఏపీఓ జి.అరుణ అన్నారు. అంబటి వలస గ్రామంలోని ఎర్రచెరువులో చేపడుతున్న ఉపాధి పనులను మంగళ వారం ఆమె పరిశీలించారు. వేతనదారులకు పలు సూచనలు చేశారు. ఏవిధంగా పనులు చేస్తే గిట్టుబాటు వేతనం అందుతుందో వివరించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉద యం ఆరు గంటల కల్లా పనులు ప్రారంభించి 10 గంటలకు ముగించాలని, మళ్లీ సాయంత్రం నాలుగు గంటలకు పనులకు హాజరు కావాలని చెప్పారు. ఆమె వెంట ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం



రాజరాజేశ్వరీదేవికి పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: దేవపల్లిలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవ మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంతో పాటు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం 6 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త ఆదుర్తి రామకృష్ణ ,విజయలక్ష్మితో పాటు అర్చకులు ధూసి శ్రీధర్ శర్మ పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి సహకరించండి



ఎమ్మెల్యే లలితకుమారికి వినతిపత్రం అందజేస్తున్న వావిలపాడు గ్రామస్తులు

వేపాడ: వావిలపాడు గ్రామంలో రామాలయం పునర్నిర్మాణానికి సహకరించాలని ఆ గ్రామపెద్దలు, ప్రజలు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని కోరారు. గ్రామపెద్దలు చిన బ్బినాయుడు, బీల సతీష్, గ్రామస్తులు ఎల్.కోటలో ఎమ్మెల్యేను ఆమె నివాసంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దేవదాయ శాఖ, టీటీడీ దేవస్థానం నుంచి నిధులు సమకూర్చి సహకారం అందించాలని గ్రామపెద్దలు కోరారు.

### చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ సతీష్, ఈఓపీఆర్డీ లక్ష్మి, తహసీల్దార్ అరుణకుమారి, తదితరులు

శృంగవరపుకోట: స్థానిక ధారగంగమ్మ ఆలయ ప్రాంగణంలో ఎస్.కోట ఈఓపీఆర్డీ వెంకటలక్ష్మి తన భర్త శివసుబ్రహ్మణ్యం స్మృత్యర్థం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులు ఎంపీ డీఓ సతీష్, తహసీల్దార్ అరుణకుమారి మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. భక్తులు, పాదచారులు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

గజపతినగరం రూరల్: ఎం.గుమడాం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ విమలమ్మ మంగళ వారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న అయిదేళ్లు నిండిన చిన్నారులను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తకు సూచించారు. ప్రభుత్వం సరఫరా చేసిన పౌష్టికాహారాన్ని కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా పంపిణీ చేయాలని చెప్పారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హాజరు రికార్డులు, వర్క్ బుక్స్, మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆమె వెంట సీఆర్పీలు ఉన్నారు.

### నేడు ప్రకృతి విపత్తులపై మాక్‌డ్రిల్

భోగాపురం: తుఫాన్‌లు వంటి ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే విషయమై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ప్రభుత్వ శాఖల సమన్వయంతో మండలంలోని చేపలకంచేరు గ్రామంలో బుధవారం ఉదయం 9 గంటలకు మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా ప్రాజెక్టు అధికారి ఎం.రాజేశ్వరి మంగళవారం తెలిపారు. ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచనలతో చేపలకంచేరులోని సచివాలయం వద్ద గల ఎంపీయూపీ స్కూల్ ఆవరణలో బుధవారం అన్ని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో ప్రజలకు విపత్తులను ఎదుర్కొనే విషయమై తగిన అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు.

# రుణాలకు వారే అర్హులా...?

- బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరులో పక్షపాత వైఖరి
- కూటమి పార్టీల సానుభూతి పరులకే రుణాలు
- ఎమ్మెల్యే సిఫార్సు చేసిన జాబితాలో ఉన్న వారినే అర్హులుగా గుర్తిస్తున్న అధికారులు



గుర్ల ఎంపీడీఓ కార్యాలయంలో రుణాలకు ఇంటర్వ్యూలు చేస్తున్న అధికారులు (ఫైల్)

గుర్ల: కూటమి అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, జాబ్ రాకపోతే నిరుద్యోగ యువతకు నెలనెలా భృతి ఇచ్చి ఆదుకుంటామని ఎన్నికల ముందు కూటమి నేతలు ఊరూరా ఊదరగొట్టారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించడంలో, నిరుద్యోగ భృతి చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఉన్నత చదువులు చదివి ఉద్యోగ అవకాశాలు లేకపోయిన ప్పటికీ స్వయం ఉపాధి అవకాశాలతో తమ సొంత కాళ్లపై నిలబడుదా మనుకునే యువతకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువవుతోంది. వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుందామనుకునే యువతకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం ముఖం చాటేస్తుందనేందుకు బీసీ కార్పొరేషన్ రుణాలే మంచి ఉదాహరణ. తాజాగా ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ రుణాలకు చీపురుపల్లి నియోజకవర్గంలోని చీపురుపల్లి మండలంలో 715 మంది, గుర్ల మండలంలో 662 మంది, గరివిడిలో 500 మంది బీసీ యువత రుణాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఇంతమంది దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం మాత్రం మండలానికి వందకు మించి రుణాలు ఇవ్వడం లేదు. చీపురుపల్లి మండలానికి 99, గుర్ల మండలానికి 102, గరివిడి మండలానికి 106 యూనిట్లు మాత్రమే మంజూరు చేయాలని లక్ష్యం పెట్టుకుంది. రుణం మంజూరైతే బిజినెస్ ప్రారంభిద్దామనుకుని, మంచి వ్యాపార ఆలోచనలతో ముందుకు వస్తున్న యువతకు కూటమి నేతలు మోకాలు అడ్డుతున్నారు. అర్హతతో సంబంధం లేకుండా తాము చెప్పిన, ఎమ్మెల్యే లేఖలో సిఫార్సు చేసిన వారికే రుణాలు ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. దీంతో అధికారులు వారి మాటలకు తలొగ్గి వారి ఇచ్చిన పేర్లను మాత్రమే బ్యాంకులకు పంపిస్తున్నారు.

**అర్హులకు అన్యాయం**

మండల అధికారులు, బీసీ కార్పొరేషన్ అధికారులు అర్హులకు అన్యాయం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రుణాలకు సంబంధించి తాజాగా అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయితే ఈ ఇంటర్వ్యూల ప్రక్రియ అంతా పేరుకేనని, ఎవరికి రుణాలు ఇవ్వాలన్నది టీడీపీ నాయకులే నిర్ణయిస్తున్నారని నిరుద్యోగ యువత ఆరోపిస్తున్నారు. గ్రామాల నుంచి టీడీపీ నాయకులు ఇప్పటికే వారికి నచ్చిన ఇద్దరు, ముగ్గురు పేర్లతో జాబితాను ఎంపీడీఓ కార్యాలయానికి అందజేశారు. వారికి మాత్రమే రుణాలు మంజూరయ్యేలా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో నిజమైన అర్హులు అన్యాయమై పోతున్నారే చర్చ అంతటా జరుగుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎవరి సిఫార్సులు లేకుండానే అర్హుల ఇళ్లకు సంక్షేమ పథకాలు చేరేవి. పార్టీలు,కులాలు, మతాలు, ప్రాంతాలతో సంబంధం లేకుండా పారదర్శకంగా పథకాలు, రుణాలు అందేవి. కూటమి ప్రభుత్వంలో మాత్రం అటువంటివేమీ లేవని, ఆ పార్టీల సానుభూతి పరులకే పనులు జరుగుతాయని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

**అర్హులందరికీ మంజూరు చేస్తాం..**

అర్హులందరికీ బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేస్తాం. అర్హుల వివరాలతో కూడిన జాబితాను బ్యాంకులకు పంపించడానికి సిద్ధం చేస్తున్నాం. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి రాజకీయ జోక్యం లేదు .

– శేషుబాబు , గుర్ల ఎంపీడీఓ

### • నవధాన్యాల సాగుతో భూసారం



నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని వెలుగు ఏపీఎం వెంకటరమణ అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా కొత్తవలస మండలంలోని దెందేరు గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారులకు మంగళవారం నవధ్యానాల విత్తన కిట్లను పంపిణీ చేశారు. నువ్వులతో పాటు 11 రకాల విత్తనాలతో 1.5 కిలోల బరువుగల కిట్‌ను రూ. 100 చొప్పున 125 కిట్లను రైతులకు అందజేశారు. నవ ధాన్యాల సాగులో కలిగే ప్రయోజనాలను ఏపీఎం వివరించారు. నువ్వుల పంటలో చిరు ధాన్యాలు కలిపి విత్తడం వల్ల ప్రధాన పంటకు పోషకాలు అందడంతో పాటు భూమిలో తేమ శాతం మెరుగుపడుతుందని, అదనపు ఆదాయం వస్తుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కోటి బాబు, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు ఎస్.వరలక్ష్మి, యూనిట్ ఇన్‌చార్జ్ శ్రావ్య తదితరులు పాల్గొన్నారు. – కొత్తవలస

### • సామూహిక సీమంతాలు



పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ పీఓ ఆరుద్ర ఆధ్వర్యంలో గుర్లలోని అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం సామూహిక సీమంతాలు ,అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా పీఓ ఆరుద్ర గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు వేసుకోవాలని, విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మ,రాధిక ఉన్నారు. – గుర్ల

## పరామర్శ



ఎంపీపీ హైమావతిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: మోకాళ్ల చిప్ప మార్పిడి శస్త్రచికిత్స చేయించుకుని రామవరంలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఎంపీపీ పీరుబండి హైమావతిని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మంగళవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే మురపాక గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త గండి వెంకటరమణ దంపతులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయ పడ్డారు.ఈ విషయం తెలుసుకున్న అప్పలనరసయ్య మురపాక వెళ్లి వెంకటరమణ దంపతులను పరామర్శించారు. అనంతరం గొడియాడ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొబ్బిలి చిన్నంనాయుడు పరామర్శించారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహిందకుమార్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జాగారపు అప్పారావు, రామవరం సర్పంచ్ పీరుబండి పద్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు లచ్చి రెడ్డి కృష్ణ, వేమలి ముత్యాల నాయుడు, కె. కొండలరావు, చప్ప చిన్న, వర్రి మల్లునాయుడు, అలమండ మహేష్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## వైభవంగా మరిడిమాంబ పండగ



అమ్మవారి ఘటాలతో భక్తులు



అమ్మవారి ఆలయానికి వెళుతున్న భక్తులు

వేపాడ: అంకాజోస్యులపాలెంలో గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి పండగను మంగ ళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామపెద్దలు గొంపకృష్ణ, బోజంకి శ్రీను ఆధ్వర్యంలో భక్తులు ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం భారీగా బాణ సంచాకాల్చారు. ఊరేగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ వేషధారణలు, తప్పెటగుళ్ల ప్రదర్శన, కోలాటం ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు చోటుచేసుకోకుండా వల్లంపూడి ఎస్ఐ బి.దేవి నేతృత్వంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

## అనుమతి పత్రాలు చూపించకుంటే కూల్చేస్తాం..!



జగన్నాథం లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న జీ ప్లస్–3 భవనం

కొత్తవలస: తుమ్మికాపల్లి పంచాయతీ పరిధిలోని జగన్నాథం లేఅవుట్‌లో జీ ప్లస్–3 భవనాన్ని నిర్మిస్తున్న భవన యజ మాని గోపీనాథ్‌కు పంచాయతీ కార్యదర్శి రాజుకుమార్ మంగళవారం నోటీసులు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి గతవారం ఈభవన నిర్మాణాన్ని పరిశీలించి, అనుమతి పత్రాలను చూపించాలని భవన యజమానిని కోరారు. తాము ఉడా, పంచాయతీల నుంచి అనుమతులు తీసుకున్నామని భవన యజమాని బదులు ఇచ్చారే కానీ ఆరోజు అనుమతి పత్రాలను చూపించలేదు. దీంతో మరోమారు మంగళవారం సదరు యజమాని వద్దకు పంచాయతీ కార్యదర్శి వెళ్లి అనుమతిపత్రాలను చూపాలని కోరారు. భవన యజమాని పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో.. ఏడురోజుల్లో అనుమతి పత్రాలను చూపాలని కోరుతూ పంచాయితీ కార్యదర్శి ఆయనకి నోటీసులు అందించారు. అనుమతి పత్రాలు చూపకపోతే మరో నోటీసు ఇచ్చి, అక్కడి నుంచి మూడు రోజుల తర్వాత భవన నిర్మాణాన్ని కూల్చేస్తామని, అందుకు అయ్యే ఖర్చులను భవన యజమాని నుంచే వసూలు చేస్తామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

## • భారీ వర్షం

లక్కవరపుకోట/ కొత్తవలస: ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షం ఉపశమ నం కలిగించింది. కొత్తవలస,లక్కవరపుకోట మండలాల్లోని పలు గ్రామాల్లో సుమారు రెండు గంటల పాటు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఈవర్షం వల్ల వేసవి దుక్కలకు, నువ్వు పంట సాగుకు అదునుకుదిరిందని రైతులు అంటున్నారు.అలాగే మామిడి పంటకూ మంచిదేనని చెబుతున్నారు. కొత్తవలస జంక్షన్‌లో వరద నీరు ముంచెత్తడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది.




కొత్తవలస జంక్షన్‌ను ముంచెత్తిన వరదనీరు

### ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు డీఎస్సీ ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ అన్ని సబ్జెక్టుల పరీక్షలకు అర్హులైన జిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్ (ఈబీసీ), ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతున్నామని గురజాడ అప్పారావు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జె.జ్యోతిశ్రీ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణకు అభ్యర్థుల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. వివరాలకు 9603557333, 9177726454 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### నగదు చోరీపై కేసు నమోదు

బొండపల్లి: ఈనెల 13న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకల్లో తన పర్సు చోరీ అయ్యిందని మండల కేంద్రానికి చెందిన నున గొప్పల చంద్రరావు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ యు.మహేష్ తెలిపారు. పర్సులో రూ.7,500 నగదుతో పాటు విలువైన కార్డులు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్ఐ తెలిపారు.

### వినియోగంలోకి మరుగుదొడ్లు



మండల విద్యావనరుల కేంద్రంలో వినియోగంలోకి వచ్చిన మరుగుదొడ్లు

సాక్షి ఎఫెక్ట్...

మెరకముడిదాం: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో పాటు ఉన్న చోట వినియోగానికి వీల్లేని విధంగా ఉన్న తీరుపై ఈనెల 3వతేదీన సాక్షిలో 'మరుగుదొడ్లు లేక అవస్థలు' శీర్షికతో కథనం వెలువడింది. ఈకథనానికి ధికారులు స్పందించారు. అందులో భాగంగానే స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో మరుగుదొడ్ల చుట్టూ ఉన్న తుప్పల తొలగింపు పనులను ఎంఈఓ చంద్రశేఖర్ మంగళవారం చేయించారు. నాలుగు మరుగుదొడ్లలో రెండు వినియోగంలోకి తీసుకువచ్చారు. మిగిలిన రెండింటికి త్వరలో మరమ్మతులు చేయిస్తామని ఆయన సాక్షికి తెలిపారు.

## కోర్టు ప్రాంగణంలో పార్కింగ్‌షెడ్ ప్రారంభం



పార్కింగ్ షెడ్‌ను ప్రారంభిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరిదేముడు

శృంగవరపుకోట: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన వెహికల్ పార్కింగ్ షెడ్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు, కార్యదర్శి బి.వి.ఎస్.రామారావు మంగళ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సూరిదేముడు మాట్లాడుతూ న్యాయవాదులు అంతా సమకూర్చిన నిధులతో పార్కింగ్ షెడ్ నిర్మించామని చెప్పారు. న్యాయవాదులు ఎం.దుర్గాప్రసాద్, బి.త్రిమూర్తులు, డబ్ల్యూ.ఎస్.శర్మ, వారాది ఈశ్వరరావు, టి.వి.ఆర్.మూర్తి, బి.వెంకటరావు, బి.రామకృష్ణ, బి.సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, జి.చిట్టిబాబు, ఎల్.అప్పారావు, శేఖర్, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



మంటలను అదుపుచేయడంపై ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గజపతినగరం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ వద్ద సిబ్బంది, ప్రయాణికులకు అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపకశాఖ అధికారి ఎం.ఎస్.వి.రవిప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. అగ్నిమాపకశాఖ అధికారి మాట్లాడుతూ వేసవిలో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అగ్నిప్రమాదాలు సంభవించేటప్పుడు మంటలను అదుపు చేసే విధానాలను ప్రయోగాత్మకంగా వివరించారు. అనంతరం అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర వివరాలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లల సంరక్షణపై ప్రత్యేక దృష్టి



లక్కవరపుకోట: రంగరాయపురంలో తల్లిదండ్రులకు సూచనలు చేస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలు



మెరకముడిదాం: ఉత్తరావల్లిలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి

లక్కవరపుకోట: పిల్లల సంరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పి.భాగ్యలక్ష్మి సూచించారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా రంగరాయపురంలో మంగళ వారం గృహసందర్శన చేశారు. అంగన్‌వాడీ ప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులకు బిడ్డల బరువు, పెరుగుదలపై పలు సూచనలు చేశారు. అలాగే పిల్లలకు వయస్సును బట్టి ఆహారం ఎంతమోతాదులో ఇవ్వాలి, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉండే ఆహారాన్ని ఏవిధంగా తయారు చేసుకోవాలో వివరించారు. పౌష్టికాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి ఎన్‌ఆర్‌సీకి రిఫర్ చేస్తామని తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

**పౌష్టికాహారంతోనే ఆరోగ్యం**

మెరకముడిదాం: విధిగా పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్ వైజర్ జె.లక్ష్మి అన్నారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఉత్తరావల్లి సెక్టార్ పరిధి అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి మాట్లాడుతూ పిల్లల వెయ్యి రోజుల సంరక్షణ కోసం ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రణాళిక ప్రతులను తల్లులకు పంపిణీ చేశారు.స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి



ఉపాధివేతనదారులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం వెంకటరావు

వేపాడ: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని నీలకంఠరాజపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ వెంకటరావు సూచించారు. నీలకంఠరాజపురం గ్రామంలో మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రదేశానికి వెళ్లి వేతనదారులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని హెచ్‌ఎం చెప్పారు. అయిదో తరగతి పూర్తవుతున్న పిల్లలను తమ హైస్కూల్‌లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.